క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదిలాబాద్‌టౌన్: విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆదివారం కైలాస్‌నగర్, మావల ఫీడర్ల పరిధిలో విద్యుత్ అంతరాయం కలగనున్నట్లు ఎస్ఈ జేఆర్ చౌహాన్ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఆయా ఫీడర్ల పరిధిలోని ఖానాపూర్, వినాయక్ చౌక్, శాంతినగర్, కైలాసనగర్, ఓల్డ్ హౌసింగ్ బోర్డు, మసూద్ చౌక్, టీచర్స్ కాలనీ, సప్తగిరి కాలనీ, అటెండర్ కాలనీ, ఆర్ఆర్ నగర్, దస్నాపూర్, రాంనగర్, సంజయ్‌నగర్, కలెక్టర్ చౌక్, రిమ్స్ ఆస్పత్రి, పాలిటెక్నిక్ ఇండస్ట్రీ ఏరియాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

టాటా టెక్నాలజీలో చేర్చడంపై హర్షం

కైలాస్‌నగర్: ఐటీఐలను సాంకేతిక నైపుణ్య శిక్షణ కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం టాటా టెక్నాలజీస్‌తో ఒప్పందం చేసుకోవడం, అందులో ఆదిలాబాద్ ఐటీఐని చేర్చడం హర్షణీయమని ఐటీఐ కళాశాల ఐఎంసీ చైర్మన్ బాలురి గోవర్ధన్ రెడ్డి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కళాశాలలో మౌలిక వసతులు కల్పించడంతో పాటు యువతకు సాంకేతిక నైపుణ్యం అందే అవకాశం కల్పించిన సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, సాంకేతిక విద్యాశాఖ మంత్రి శ్రీధర్‌బాబులకు ధన్యావాదాలు తెలిపారు.

రక్తదానం

నేరడిగొండ: హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆస్పత్రిలో గర్భిణీకి ఓ పాజిటివ్ రక్తం అవసరం ఉండడంతో కాంగ్రెస్ జిల్లా నాయకుడు ఏలేటి అశ్విన్‌రెడ్డి శనివారం రక్తదానం చేసి మానవత్వాన్ని చాటాడు. బాధితురాలి కుటుంబ సభ్యులు అశ్విన్‌రెడ్డిని సంప్రదించగా ఆయన స్పందించి ఆస్పత్రికి చేరుకొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. దీంతో వారు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

అమిత్ షా సభ జయప్రదం చేయండి



మాట్లాడుతున్న పతంగే బ్రహ్మానంద్

నేరడిగొండ: సికింద్రాబాద్‌లోని ఇంపీరియల్ గార్డెన్‌లో ఈనెల 12న జరిగే కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సభను జయప్రదం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రతీ మండలంలోని బూత్ కమిటీ అధ్యక్షులు హాజరై విజయవంతం చేయగలరని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు హీరాసింగ్, ప్రధాన కార్యదర్శులు సాబ్లే సంతోష్ సింగ్, ప్రశాంత్, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులు

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలో శనివారం జెడ్పీటీసీ మల్లేపూల నర్సయ్య అధ్వర్యంలో బీఆర్ఎస్‌కు చెందిన పలువురు నాయకులు ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర విచార్ విభాగ్ కోఆర్డినేటర్ తుల అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలకు ఆకర్శితులై ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని, రా నున్న లోకసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకుంటామన్నారు. మండల అధ్యక్షుడు జల్కే పాండురంగ్, పద్వల్ రాజు, సూర్య వంశీ పాండు, బత్తిని కిషన్, గవ్వల దేవేందర్, బాల రవి, రాము, విఠల్, సాధిక్, గంగాధర్, సుధీర్, సందీప్ పాల్గొన్నారు.

ఉట్నూర్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన మొగిలి



సీఐని సన్మానిస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ సీఐగా మొగిలి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా సీఐని స్థానిక పోలీస్‌స్టేషన్‌లోని సీఐ కార్యాలయంలో బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ శాలువాతో సత్కరించారు. అంతకు ముందు ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ.. శాంతి భద్రల దృష్ట్యా ఉట్నూర్ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా సేవలు అందిస్తామన్నారు.

ఆలయాల్లో భక్తుల సందడి

- రెండో రోజూ ప్రత్యేక పూజలు
- ఉపవాస దీక్ష విరమించిన భక్తులు



నార్నూర్: చోర్గవ్‌లో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

నార్నూర్: మహా శివరాత్రిని పురస్కరించుకొని మండలంలోని చోర్గవ్‌లో ఆధ్యాత్మికత సంతరించుకుంది. శివానామ స్మరణతో మార్మోగింది. శనివారం గ్రామంలో భారీ శోభాయాత్ర నిర్వహించారు. జ్వాలాముఖి పీఠాధిపతి శ్రీరామ్ సింగ్ మహరాజ్, శ్రీమూర్తి రాములు శివాలయం పీఠాధిపతి శ్రీరామ్ మహరాజ్‌లు శోభాయాత్రలకు ఘన స్వాగతం పలికారు. అనంతరం పీఠాధిపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆధ్యాత్మిక భావంతో మెలిగినప్పుడే సమాజం జాగృతి వైపు ప్రయాణిస్తుందన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. నేటి యువతకు సమాజం గురించి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్, బానోత్ గజానంద్ నాయక్, కెరిమెరి జెడ్పీటీసీ దుర్పతాబాయి, హేమలత బిర్జులాల్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సిరికొండ: మండల కేంద్రంతో పాటుగా మండలంలోని సుంకిడి, కొండపూర్‌లోని శివాలయాలు రెండో రోజు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే భక్తులు బారులు తీరారు. ఉపవాస దీక్షలు విరమించారు. కొండపూర్ శివాలయం వద్ద నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన జట్టుకు బహుమతులు అందజేశారు.

బేల: మండలంలోని బాది గ్రామ శివారులోని నందీశ్వర ఆలయంలో మహా శివరాత్రిని పురస్కరించుకుని శనివారం మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మెట్టు ప్రహ్లాద్, తాక్రే గంభీర్, సతీష్ పవార్, ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శివరాత్రి సందర్భంగా సైకిల్ యాత్ర

జైనథ్: నిర్మల్‌కు చెందిన ప్రముఖ న్యూరాలజిస్ట్ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో 10 మంది బృందం శివరాత్రి సందర్భంగా సైకిల్‌యాత్ర నిర్వహించారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని వారు నిర్మల్ నుంచి ఆదిలాబాద్‌కు 100 కిలోమీటర్ల సైకిల్ యాత్ర చేపట్టారు. శుక్రవారం అర్ధరాత్రి సైకిల్‌పై జైనథ్‌కు చేరుకొని, శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

బోథ్: మండల వ్యాప్తంగా మహా శివరాత్రి వేడుకలు శనివారం ముగిశాయి. భక్తులు శనివారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పట్టణ కేంద్రంలోని మార్కండేయ ఆలయంలో భక్తులు రాత్రంతా భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో అన్నదానం చేశారు. నిత్యభజనలు చేసిన వారిని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వేముల చంద్ర మోహన్, ప్రధాన కార్యదర్శి భైరి రవి, కోశాధికారి దీకొండ సత్యనారాయణ, మెరుగు భోజన్న, అనిల్ కుమార్, రవి, రవీందర్, రాజేశ్వర్, నర్సయ్య, ప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.



జైనథ్: నర్సింహారెడ్డిని సన్మానిస్తున్న అశోక్ రెడ్డి

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో శివరాత్రి పూజలను భక్తులు శనివారం నిర్వహించారు. అనంతరం ఉపవాస దీక్షలను విరమించారు. మండల కేంద్రంలోని భీంనగర్, రాధాకృష్ణనగర్, రాంనగర్‌తో పాటు మండలంలోని దనోరా(బి) గ్రామాల్లో మహాదేవుని పల్లకితో శోభాయాత్ర నిర్వహించారు.



సిరికొండ: శివాలయంలో భక్తుల సందడి



బేల: పూజలు చేస్తున్న జోగు రామన్న



ఇంద్రవెల్లి: శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

ముగిసిన సోమేశ్వర ఆలయ జాతర

నేరడిగొండ: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం కుంటాల సోమేశ్వర ఆలయానికి భక్తుల తాకిడి కనిపించింది. సహజసిద్ధంగా ఏర్పడిన గుహలో కొలువైన సోమేశ్వరుడిని భక్తిశ్రద్ధలతో భక్తులు పూజించారు. శుక్రవారం ఉపవాసం చేపట్టిన భక్తులు శనివారం కుటుంబ సభ్యులతో కలిసి జలపాతం వద్ద వంటకాలు చేసి ఉపవాస దీక్షలను విరమించారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ జలపాతం వద్ద భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. కుంటాల గ్రామ మయూరి యూత్ అసోసియేషన్ సభ్యులు భక్తులకు ఇబ్బందులు కలగకుండా సహకరించారు. నేరడిగొండ మండల కేంద్రంతో పాటు వడూర్, కుమారి, సవర్గాం, గొలిగూడ తదితర గ్రామాల్లోని శివాలయాల్లో భక్తుల రద్దీ కనిపించింది.

లక్ష్మి నరసింహస్వామి ఆలయ జాతర..

తాంసి: మండలంలోని వడ్డాడి గ్రామంలో వెలసిన స్వయంభూ లక్ష్మి నరసింహస్వామి ఆలయ జాతర శనివారం ముగిసింది. రెండు రోజులుగా కొనసాగుతున్న జాతర చివరి రోజు భక్తులు పెద్ద ఎత్తున హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మహా శివరాత్రిని పురస్కరించుకుని ప్రతీ ఏటా నిర్వహించే జాతరలో భాగంగా ఈ ఏడాది కూడా మూడు రోజుల పాటు జాతర నిర్వహించారు. శివరాత్రి రోజున హోమం, శివ పార్వతుల కల్యాణం, సామూహిక సత్యనారాయణ వ్రతాలు చేశారు. చివరి రోజు పూర్ణాహుతి, దీపారాధనతో పాటు సాయంత్రం కన్నుల పండువగా రథోత్సవం చేపట్టారు. మండలంలోని తాంసి, కప్పర్ల, జామిడి, నాగాపూర్, గిరిగాం, పొన్నారి, హస్నాపూర్ గ్రామాలకు చెందిన భక్తులతో పాటు మహారాష్ట్రకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. దీంతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఆలయ అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శ్రీకాంత్, గ్రామ పెద్దలు శ్రీనివాస్, లక్ష్మణ్, ఎంపీటీసీ అశోక్, శ్రీధర్ రెడ్డి, అరుణ్, రమణ, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



మెట్ల ద్వారా గుహలోనికి వెళ్తున్న భక్తులు

రాయల సుభాష్ ఆశయాలు సాధించాలి

ఎదులాపురం: సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గోదావరి లోయ ప్రతిఘటన పోరాట యోధుడు కామ్రేడ్ రాయల సుభాశ్ రవన్న ఆశయాలను సాధించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యవర్గ సభ్యులు జగన్‌సింగ్ కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రజాపంథా కార్యాలయంలో రాయల సుభాశ్ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆదివాసీల విముక్తి, వారికి భూమిపై హక్కు కల్పించడం కోసం 40 ఏళ్లు అజ్ఞాత జీవితం గడుపుతూ అనేక పోరాటాలు చేశారని కొనియాడారు. కార్మికుల తరపున పోరాటాలు చేసి పెట్టుబడిదారుల శ్రమ దోపిడీ నుంచి విముక్తి కల్పించారని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ నాయకులు కొడప సురేశ్, దుర్గం టేకు పటేల్, రేణుక, వనిత, సిడాం సాయికుమార్, జంగుబాయ్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

సమావేశాన్ని విజయవంతం చేయండి

ఉట్నూర్‌రూరల్: నిర్మల్‌లో ఈనెల 13న నిర్వహించే ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అరెల్లి మల్లేశ్ మాదిగ కోరారు. శనివారం మాదిగ సంఘ భవనంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సమీక్షా సమావేశం నిర్మల్ జిల్లాలో ఉంటుందన్నారు. ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ హాజరవడం జరుగుతుందని తెలిపారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎస్సీ వర్గీకరణ అంశాన్ని దృష్టిలో ఉంచుకొని అనుసరించాల్సిన విధానాలపై కార్యకర్తలకు దిశ నిర్దేశం చేయనున్నారన్నారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు గొడిసెల మహేశ్, ప్రశాంత్, సురేశ్, కిరణ్, మహేందర్, ఆశన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అరెల్లి మహేశ్

సోమన్న శివాలయంలో ప్రత్యేక పూజలు

బోథ్: మండలంలోని కుచులాపూర్ గ్రామంలోని సోమన్న శివాలయంలో తెలంగాణ అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ శనివారం ప్రత్యేక పూజలు చేశారు. సోమన్న ఆశీస్సులు ప్రజలపై ఉండాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట పూంద్రు రాకేశ్ రెడ్డి, సాయి, మహేందర్, భోజన్న, తదితరులు పాల్గొన్నారు.

రోగ నిరోధక టీకాలు ఇవ్వాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఐవో శ్రీనివాస్


ఇచ్చోడ: గ్రామీణ ప్రాంతాల్లో రోగ నిరోధక టీకాల కార్యక్రమాన్ని వైద్య సిబ్బంది పకడ్బందీగా నిర్వహించాలని డీఐవో శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని కేశవపట్నం, మేడిగూడ, గేర్జం గ్రామాల సబ్‌సెంటర్‌లో రికార్డులను పరిశీలించి వైద్య సిబ్బందితో మాట్లాడారు. వైద్య ఆరోగ్యశాఖ ద్వారా పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు రోగ నిరోధక టీకాలు ఇవ్వాలన్నారు. కేశవపట్నం సబ్ సెంటర్‌లో రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట సీహెచ్‌వో బ్రహ్మానందం రెడ్డి, సిబ్బంది సచిన్, ఏఎన్ఎం జారుబాయి, ఆశవర్కర్లు రత్నబాయి, ఫర్జానా, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ధ్యాన మందిర వార్షికోత్సవం

తలమడుగు: మండలంలో కూచులపూర్ గ్రామంలో పులాజీ బాబా ధ్యాన మందిర 28 వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ధ్యానం మందిరంలో జెండాను పూలాజీ బాబా సంస్థాన్ అధ్యక్షుడు రవీందర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పూలాజీ బాబా నేర్పిన అడుగుజాడల్లో ప్రతిఒక్కరూ నడుచుకోవాలన్నారు. బాబా చూపిన మార్గంలోనే ప్రయాణించాలని కోరారు. ధ్యానం అలవర్చుకొని, మానసిక ప్రశాంతత పొందన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



వార్షికోత్సవంలో పాల్గొన్న భక్తులు



పొంచి ఉన్న ప్రమాదం

తలమడుగు మండలం ఝరి గ్రామంలోని పంట చేలలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. రైతులు యాసంగిలో సాగు చేసిన జొన్న పంటను తాకేలా కిందికి వేలాడుతున్నాయి. రైతులు ఏమాత్రం అప్రమత్తంగా లేకపోయిన ప్రమాదం పొంచి ఉంది. వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయాలని కోరినా.. విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.

– సాక్షి, ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

ఆలయ అభివృద్ధికి ప్రత్యేక కృషి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

సిరికొండ: మండలంలోని కోండాపూర్ పురాతన ఆలయాన్ని అభివృద్ధి చేస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం పోచంపల్లి గ్రామంలో పర్యటించి కొలాం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. కొలాంలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, గూడెలకు అన్ని వసతులు కల్పిస్తామన్నారు. అనంతరం మండలంలోని కోండపూర్ శివాలయాన్ని సందర్శించిన ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వరకు రోడ్డు నిర్మాణం చేపడుతామన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు షేక్ ఇమామ్, రఘురాం, పెందూర్ అమృత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

ఇంద్రవెల్లి: ఆసుపత్రికి వచ్చే రోగులకు అందించే వైద్యంపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ హెచ్చరించారు. శనివారం మండలంలోని పిట్టబొంగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యాధికారుల హాజరు, రిజిస్టర్, ఓపీ వివరాలను పరిశీలించారు. వైద్యుడు సక్రమంగా విధులకు హాజరు కావడం లేదని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా. జిల్లా వైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకునే విధంగా కృషి చేస్తానన్నారు. వైద్యులు క్రమం తప్పకుండా విధులు నిర్వర్తించి అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, పట్టణ అధ్యక్షుడు జహీర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

ఎదులాపురం: ఆదిలాబాద్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందిస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగించుకోవాలని ట్రస్ట్ చైర్మన్ యూనుస్ అక్బానీ అన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యాసకులకు శనివారం ట్రస్ట్ కార్యాలయంలో సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ట్రస్ట్ సేవలను మరింత విస్తారిస్తామన్నారు. పేదరికాన్ని, నిస్సహాయతను పారదోలేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఈసందర్భంగా వితంతువులు, ఒంటరి మహిళల కోసం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 315 మందికి వైద్యులు సమీరుద్దీన్, నుమి అంజుమ్‌లు చికిత్సకు సంబంధించి కార్డులను అందించారు. అంతే కాకుండా రంజాన్ దుస్తులు, ఆర్థిక సహాయం కోసం సాహెర్ సిద్దిఖీ, యూనుస్ అక్బానీలు 600 మందికి కార్డులు అందజేశారు. కార్యక్రమంలో చారిటేబుల్ ట్రస్ట్ ఉపాధ్యక్షుడు పార్థసారిథి, అహ్మద్, ముజాహిద్, ఖైరాత్ అలీ, అబ్దుల్ గఫార్ ఫారూఖీ, సలీమ్ పారిఖ్ తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందుకుంటున్న అభ్యాసకులు

గెస్ట్ లెక్చరర్ల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న గెస్ట్ లెక్చరర్లు

ఆదిలాబాద్‌టౌన్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గెస్ట్ లెక్చరర్లు శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలో టీపీసీసీ అధికార ప్రతినిధి, పీఆర్టీయూటీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి కలిసిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 412 జూనియర్ కళాశాలల్లో 2000 మంది గెస్ట్ లెక్చరర్లు గత పదేళ్లగా నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందన్నారు. ప్రతీ ఏడాది కోర్టులకు వెళ్తే తప్ప రెన్యూవల్ కావడం లేదని వాపోయారు. చాలీచాలని వేతనంతో విధులు నిర్వర్తిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రెగ్యులర్, కాంట్రాక్ట్ అధ్యాపకులతో సమానంగా బోధన చేస్తున్నప్పటికీ వేతనం చెల్లింపుల్లో మాత్రం శ్రమ దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. టైం స్కేల్ వర్తింప చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. టీపీసీసీ అధికార ప్రతినిధి సానుకూలంగా స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర అతిథి అధ్యాపకుల సంఘం కార్యవర్గ సభ్యులు అగ్గ వేణు, గెస్ట్ లెక్చరర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామానికి చెందిన శాతం భీమన్న కుటుంబానికి వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో శనివారం రూ. 50 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న తెలంగాణలోని 100 మంది పేద, రైతు కుటుంబాలకు ఆర్థికసాయాన్ని హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి పీఎస్ఎమ్ హైస్కూళ్లలో అందజేశారు. సేవాసమితి అధ్యక్షుడు హనుమంత రావు, కిసాన్ జాగరణ్ అధ్యక్షుడు సుగుణాకర్ భీమన్న భార్య కవితకు రూ.50 వేల చెక్కు అందించినట్లు బీజేపీ నాయకులు దాదె మల్లయ్య, తిరుమలగిరి, ఉపేందర్ తెలిపారు.